సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడో?
ఎన్నికలకు ముందు మహిళలు ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించవచ్చంటూ ప్రచారం చేసుకున్నారు. టీడీపీ కూటమి నేతలు గద్దెనెక్కి 8 నెలలు దాటినా హామీని అమలు చేయలేదు. - 8లో



ఉపాధి అవినీతిపై చర్యలు తీసుకోవాలి
ఉపాధి పనుల కేటాయింపులను, కూలీల వేతనాల పంపిణీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీలు, సర్పంచ్‌లు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.180
రెండోరకం	రూ.90	రూ.146

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 60 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రాజంపేట మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్



బి.నాగేశ్వరరావు

రాజంపేట : రాజంపేట పురపాలక సంఘం కమిషనర్ బి. నాగేశ్వరరావు సస్పెండ్ అయ్యారు. సోమవారం పట్టణ అభివృద్ధి శాఖ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. విధుల పట్ల నిర్లక్ష్యం, ప్రభుత్వ ఆదేశాలను ఖాతరు చేయకపోవడం, క్షేత్రస్థాయిలో పర్యటించకుండా కార్యాలయానికే పరిమితి కావడం, ఇతర కారణాలతో ఆయనను సస్పెండ్ చేశారు. ఈ మేరకు పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులను జారీ చేశారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న స్వామి,అమ్మవారు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి మూలవిరాట్‌లకు స్వామివారికి అర్చకులు పూజలు జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులను రంగురంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు.పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధులు, ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు.భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.కార్యక్రమంలో ఈవో డివి రమణారెడ్డి పాల్గొన్నారు.

రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి చంద్రానాయక్

గుర్రంకొండ : రైతులందరూ తప్పనిసరిగా రైతు గుర్తింపు కార్డులను తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతు గుర్తింపు కార్డుల కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం 6725 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 2513 మంది గుర్తింపు కార్డుల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు సిబ్బంది తెలిపారు. ఈకార్యక్రమాన్ని ఇంకా వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుసేవాకేంద్రాల్లో రైతులు తమ భూమి రికార్డులు, వన్‌బీ, ఆధార్‌కార్డు జిరాక్స్‌కాపీలతో పాటు తమ సెల్‌ఫోన్ నంబర్ తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో గుర్తింపు కార్డులు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకొన్న వారికి త్వరలో గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎవో రత్నమ్మ, ఎఈవో అనిత, వీహెచ్‌ఎ నవాజ్, రైతులు పాల్గొన్నారు.

టెంకాయల వేలం పాట

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన కామాక్షి త్రేతేశ్వరస్వామి దేవస్థానంలో సంవత్సరం పాటు టెంకాయలు విక్రయించేందుకు వేలంపాట నిర్వహించినట్లు దేవస్థాన ఈఓ గంగవరం కొండారెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన సమక్షంలో వేలం పాట జరిగిందన్నారు. పూల దత్తాత్రేయ రూ.7,10,000 వేలం దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు.

నేడు, రేపు కడపలో అంతర్జాతీయ సదస్సు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళ,బుధవారాల్లో 'తెలుగులో రామాయణాలు – సామాజిక దృక్పథం'అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ వీసీ కె. కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారని తెలిపారు. సదస్సుల్లో దేశ విదేశాలకు సంబంధించిన ప్రతినిధులు, సాహితీవేత్తలు 60 మంది పరిశోధనా పత్రాలు సమర్పణ చేస్తారన్నారని తెలిపారు. విదేశాల ప్రతినిధులు, పత్ర సమర్పకులు అంతర్జాలం ద్వారా కూడా పాల్గొంటారన్నారు. మంగళవారం సాయంత్రం 5–30 గంటలకు భారతీయ నృత్య సంస్థాన్‌కు చెందిన 30 మంది నృత్య కళాకారులు 'సీతా రామ కల్యాణం'నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తారన్నారని ఆమె వివరించారు.



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి కువైట్ ఎంబసీ మిసాల్ ముసాపా అల్-షామితి..ఆయనను తిరుపతి ఎంపీ గురుమూర్తి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి కలిశారు. కువైట్ నుంచి విమానాలు తిరుపతి రన్‌వేపైకి తీసుకురావాలని కోరారు. ఉభయ వైఎస్సార్ జిల్లాలో రెండు లక్షలకుపైగా కువైట్‌లో జీవనోపాధి కోసం వెళుతుంటారు..వస్తుంటారు..వీరిని దృష్టిలో వుంచుకొని ఎడారి విమానం తిప్పాలని విన్నవించారు.

గల్ఫ్‌యానం.. గగనం

తిరుపతి రన్‌వేపైకి.. ఎడారి విమానాలెప్పుడో!

- ఎదురుచూపుల్లో ఉభయ జిల్లాల గల్ఫ్‌వాసులు
- ఇప్పటికైనా కేంద్రం కరుణించేనా !



తిరుపతి ఎయిర్‌పోర్టు

రాజంపేట : ఉభయ వైఎస్సార్ జిల్లా నుంచి ఎడారి దేశాల విమానాలకు రెక్కలొచ్చేదెప్పుడోనని గల్ఫ్‌వాసుల కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. రాష్ట్రం నుంచి కేంద్ర పౌర విమానాయనశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న రామ్మోహన్‌నాయుడుపై తిరుపతి ఎయిర్‌పోర్టులో ఎడారిదేశాలకు విమానయాన సౌకర్యం కల్పించే బాధ్యత పడింది. ఇవి తిరుపతి రన్‌వేపై ఎగిరితే తమ పయనానికి ఇక ఇక్కట్లు ఉండవని వేయికళ్లతో వలసజీవులు ఎదురుచూస్తున్నారు.అయితే పౌరవిమానాయన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సముద్రయానం నుంచి విమానాల దాకా..

గల్ఫ్‌దేశాలకు వెళ్లేవారు నాలుగు దశాబ్దాల కిందట సముద్రయానం ద్వారా చేరుకునేవారు. వారాల కొద్దీ పయనించి ఎడారిదేశాలకు చేరుకునేవారు. అప్పట్లో గల్ఫ్ జీవనోపాధికి డిమాండ్ లేని రోజుల్లో మాట ఇది. రానురాను అక్కడ పనిచేసే ఉన్నతంగా జీవనం సాగించవచ్చని, తమ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావచ్చనే భావనతో ఎడారి పయనాలు అధికమయ్యాయి. ముఖ్యంగా రాజంపేట, రాయచోటి, కడప, బద్వేలు, రైల్వేకోడూరుతో పాటు ఉభయ జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి 2 లక్షల మంది ఎడారిదేశాలపై ఆధారపడి జీవిస్తున్నారు

కరోనా సమయంలో గల్ఫ్‌లో కరోనా సోకిన వారిని విమానాల ద్వారా తిరుపతి ఎయిర్‌పోర్టుకు చేర్చారు. అప్పట్లో ఏపీఎస్‌ఆర్‌టీ ద్వారా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో కేంద్రప్రభుత్వం గల్ఫ్‌లో కరోనా బాధితులను క్షేమంగా స్వదేశానికి తీసుకొచ్చారు. తిరుపతి ఎయిర్‌పోర్టుకు నేరుగా విమానాల్లో తీసుకొచ్చి, వారిని జిల్లాలో ఏర్పాటు చేసిన కరోనా నివారణ శిబిరాల్లో ఉంచి, తర్వాత ఇళ్లకు క్షేమంగా చేర్చిన సంగతి విధితమే. కాగా అంతర్జాతీయసర్వీసులు తీసుకొచ్చేందుకు గత రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎడీసీఎల్) ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక నగరం తిరుపతి నుంచి అంతర్జాతీయస్థాయిలో విమాన సర్వీసులు ప్రారంభమవుతాయన్న కలలు ఇంకా కలలాగే మిగిలిపోతున్నాయి.

వ్యయప్రయాసలతో .

చెన్నై, కర్ణాటక, ముంబై, హైదరాబాద్, ఢిల్లీ నగరాలకు వ్యయప్రయాసలతో వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా అనేక మంది భాష రాక ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే మోసపోతున్నారు. దూరప్రయాణంతో అనేక అవాంతరాలు, ప్రమాదాలబారిన పడుతున్నారు.విమానటికెట్‌తో పాటు ఎయిర్‌పోర్టుకు చేరుకునే ఖర్చులు భరించలేక పోతున్నారు. 2015లో తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయహోదా కల్పించారు. కానీ ఆ స్థాయిలో విమాన సర్వీసులను తీసుకురాలేదన్న అపవాదును కేంద్రప్రభుత్వం మూటకట్టుకుంది.

ఉభయ జిల్లాల నుంచి..

రాయలసీమలో ప్రధానంగా ఉభయ వైఎస్సార్ జిల్లాల నుంచి ఎడారిదేశాలకు వెళ్లేవారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. జీవనోపాధికోసం కువైట్, ఖత్తర్, దుబాయ్, సౌదీ అరేబియా,బహ్రెయిన్, అబుదాబి, లెబనాన్, మస్కట్ దేశాలకు వెళతారు. ఉద్యోగరీత్యా, విద్య కోసం అమెరికా, కెనడా, సౌతాఫ్రికా,శ్రీలంక, ఆస్ట్రేలియాల్లో స్థిరపడిన వారు ఉన్నారు. వీరు కూడా విదేశీయానం చేయాల్సివస్తే కష్టతరంగానే ఉంది. భాషరాని వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాణించాలంటే గగనమవుతోంది. గల్ఫ్‌దేశాలకు వెళ్లే వారు అధికంగా 60 శాతం చదువురాని వారు ఉన్నారు. మోసాలపాలైన వారు చాలామంది ఉభయ జిల్లాలో ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీలు గతంలోనే ప్రయత్నాలు..

తిరుపతి, రాజంపేట లోక్‌సభ సభ్యులు తమ వంతుగా అంతర్జాతీయ విమాన సర్వీసులను రన్‌వే మీదకు తీసుకొచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తిరుపతి నుంచి విదేశీయానంపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే ఈ విషయంలో కేంద్రప్రభుత్వం కనికరించలేదు. ఫలితంగా రాయలసీమవాసులకు విదేశీయానం గగనతరంగా మారింది. తాజాగా రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తిలు కువైట్ ఎంబసీని కలిసి గల్ఫ్ విమానాలు తిరుపతి విమానశ్రయం నుంచి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గల్ఫ్ విమాన సర్వీసులు తీసుకురావాలి



తిరుపతి ఎయిర్‌పోర్టులో విదేశీ విమాన సర్వీసులను తీసుకొచ్చేందుకు వైస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రయత్నాలు జరిగాయి. ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ఇప్పటి వరకు కరుణించలేదు. గల్ఫ్‌వాసులకు విమానయాన సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. గత రాష్ట్ర ప్రభుత్వం , ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రయత్నాలు చేశాయి.
– పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

కేంద్రం తక్షణమే స్పందించాలి



రాయలసీమ జిల్లా వాసులకు అందుబాటులో ఉండే తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి విదేశీ విమాన సర్వీసులను ప్రవేశపెట్టాలి.దీనిపై కేంద్రప్రభుత్వం స్పందించాలి. ఆ దిశగా అడుగులు వేయాలి. విదేశాలకు వెళ్లాలంటే ఇతర రాష్ట్రాల వైపు చూడాల్సి వస్తోంది. చెన్నై, బెంగళూరు తదితర రాష్ట్రాలకు చెందిన విమానశ్రయాల ద్వారా వెళ్లాలంటే కష్టతరంగా ఉంది. కువైట్ ఎంబీసీకి తిరుపతి ఎంపీతో కలిసి ఈ విషయం తెలియజేశాం. కనీసం కడపోళ్ల కోసం కువైట్ నుంచి విమానం నడిపించాలి
– మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు

రంగ రంగ.. వైభవంగా!





రథంలో కొలువుతీరిన సతీసమేత శ్రీరంగనాథుడు, పురవీధులలో శ్రీరంగనాథుని తేరు

- కదిలింది బ్రహ్మారథం
- దారిపొడవునా గోవిందా నామస్మరణలు, భజనలు

పులివెందుల : వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలో శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామి రథోత్సవ వేడుకలు కనుల పండువగా జరిగాయి. రథోత్సవాన్ని తిలకించేందుకు పట్టణ పరిధిలోని భక్తులతోపాటు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి కాయ కర్పూరాలు సమర్పించారు. స్వామి వారి తేరు (రథం) కింద గుమ్మడికాయలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. దారి పొడవునా గోవింద నామస్మరణలు చేశారు. తేరు ప్రారంభానికి ముందు అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ విశేష పూజలు జరిపించారు. ఉభయదారులకు అర్చనలు చేశారు. తేరు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డితోపాటు మున్సిపల్ చైర్మెన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్ చిన్నప్ప, అంకాలమ్మ ఆలయ చైర్మెన్ బ్యాటరీ ప్రసాద్, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, మాజీ బలిజ సంఘం అధ్యక్షుడు సోపాల వీరా, వివిధ శాఖల అధికారులతో స్వామి వారికి పూజలు జరిపించారు. ఆలయ మర్యాదలతో ఆలయ చైర్మెన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ వెంకటరమణలు వారిని సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. రథోత్సవం స్థానిక పూలంగళ్ల సర్కిల్ నుంచి కొనసాగి శ్రీనివాస హాలు రోడ్డు, ముత్యాల వారి వీధి, గుంత బజార్, బంగారు అంగళ్ల మీదుగా తిరిగి పూల అంగళ్ల సర్కిల్‌కు చేరుకుంది.

బాధ్యతగా ప్రజా సమస్యలను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్


రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా అధికారులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సమస్యను ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందన్నారు. కావున అధికారులందరూ ఫిర్యాదులను నూరుశాతం పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్‌ఎల్‌ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌ఓ మధుసూదనరావు, ఎస్‌డీసీ రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాటమరాజు మాన్యం భూమిని ఇప్పించండి

గ్రామస్తులంతా కలిసి సంక్రాంతి పండుగ రోజున ఉత్సాహంగా జరుపుకునే కాటమరాజు గుడి స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా చూడాలని గాలివీడు గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం గాలివీడు మండలం నూలివీడు గ్రామానికి చెందిన వంద మంది ప్రజలు ప్రత్యేక బస్సు, ఇతర వాహనాల ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఫిర్యాదును అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 1880, 1887లలో ఉన్న భూమిలో పూర్వీకుల నుంచి కాటమరాజు గుడి కట్టుకొని, అక్కడే ఏటా సంక్రాంతి పండుగ రోజున చిట్లాకుప్ప వేసుకొని పశువులను ఊరేగింపు నిర్వహించేవారమన్నారు. అయితే స్థానికంగా ఉన్న కొందరు ఆ స్థలాన్ని డీకేటీ పట్టాగా మార్చుకుని కాజేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.ఈ ఏడాది జనవరి 20వ తేదీన ఇదే విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ ఫోన్ ద్వారా గాలివీడు తహసీల్దార్‌తో మాట్లాడి దేవుని మాన్యానికి సంబంధించిన భూమిలో ఉన్న పట్టాలను రద్దు చేసి ప్రజలకు అప్పగించాలని సూచించిన విషయాన్ని ప్రజలు గుర్తు చేశారు. కలెక్టర్ ఆదేశాలను మండల తహసీల్దార్ పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు అక్కడ పంటలు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందించి గ్రామస్తులకు న్యాయం జరిగేలా చూస్తానని మరోమారు హామీ ఇచ్చినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. అంతకు ముందు గ్రామస్తులంతా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గుడికి సంబంధించిన ఆస్తిని ఆక్రమణకు గురికాకుండా చూడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

లెక్కల గారడీ

- ఇళ్లన్నీ ప్రారంభమయ్యాయట!
- నాన్‌స్టార్టెడ్ గృహాలు నిర్మాణాల్లో ఉన్నాయట
- స్థాయి లెక్క మార్చేసి లక్ష్యం కోసం తంటాలు



కురబలకోట మండలం కంటేవారిపల్లిలోని జగనన్న కాలనీ

బి.కొత్తకోట : జిల్లాలోని పేదలకు గూడు భరోసా కల్పిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా 78,221 మందికి పక్కా గృహాలను మంజూరు చేసింది. ఈ ఇళ్ల నిర్మాణం కోసం ఇంటిస్థలాలు, నిర్మాణ నిధులు ఇచ్చింది. దీంతో పాటు నిర్మాణాలకు ఇబ్బందులు కలగకుండా బోర్లు, విద్యుత్ సౌకర్యం, పుష్కలంగా నీరు లభించేలా చర్యలు తీసుకుంది. రహదారులు ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాల విషయంలో లెక్కలు తప్పుతున్నట్టుగా కనిపిస్తోంది. ఎన్ని ఇళ్లు ఏ స్థాయిలో ఉన్నాయి, వాటికి ఎంత బిల్లు చెల్లించారు ఇలా పూర్తి వివరాలను ఏ రోజుకారోజూ సిద్ధం చేయాలి. లేకపోతే పేదల ఇళ్లకు అన్యాయం జరుగుతోందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎన్ఎస్..బీబీఎల్‌లోకి..

జిల్లాలో జనవరి మొదటి వారం దాకా నిర్మాణాలే చేపట్టని (నాన్ స్టార్టెడ్) గృహాలు 8,725 ఉన్నట్టు గృహనిర్మాణశాఖ లెక్క. అంటే ఈ ఇళ్ల పనులను లబ్ధిదారులు ఇంకా మొదలు పెట్టలేదు. అయితే ఈ లెక్కను అధికారులు తారుమారు చేశారని తెలుస్తోంది. ఫిబ్రవరి మొదటివారానికి నాన్‌స్టార్టెడ్ ఇళ్ల సంఖ్య 1,046కు తగ్గిపోయింది. అంటే కేవలం నెలన్నరోజుల్లో 7,679 ఇళ్ల నిర్మాణాలను పునాదుల స్థాయి నుంచి మొదలు పెట్టారన్నది లెక్క. ఈ విషయంలో రాష్ట్ర అధికారిక లెక్క ప్రకారం నెలక్రితం నివేదికలు పరిశీలిస్తే..అందులోనూ నాన్ స్టార్టెడ్ ఇళ్ల సంఖ్య లేదు. ప్రారంభంకాని అన్ని ఇళ్లను బీబీఎల్ స్థాయిలో ఉన్నట్టు..ఆ ఇళ్లసంఖ్య 9,754గా పేర్కొన్నారు. ఫిబ్రవరి మొదటివారం నివేదికలో బీబీఎల్ ఇళ్లు 9,385గా ఉంది. అంటే నాన్ స్టార్టెడ్ ఇళ్లు దాదాపుగా ప్రారంభమైనట్టుగా లెక్క వేశారు. ఇది అధికారుల లెక్కకు బాగానే ఉంటుంది.. కానీ లబ్ధిదారుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం అవుతోంది.

గడువు దాటాక కష్టాలే

ఈ మార్చిలోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకుంటే కేంద్రం నుంచి నిధులు రావని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీని కారణంగానే అధికారులు అన్నీ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాని నివేదిస్తున్నట్టు చెబుతున్నారు. ఇలా చేయడం ద్వారా భవిష్యత్‌లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మించుకునేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుంది. ఇప్పటికే ఇంటి నిర్మాణం మొదలైనట్టు ఆన్‌లైన్‌లో స్థాయి నమోదు కావడంతో కొత్తగా మళ్లీ ఇంటికి అర్హత కోల్పోవాల్సిందే. ప్రారంభంకాని జాబితాలో ఉంటే ఇంకోసారైనా ఇంటిని నిర్మించుకునేందుకు అవకాశం దక్కుతుంది. ఇప్పుడు నిర్మాణంలో ఉన్నట్టు చూపితే భవిష్యత్‌లో ఇంటికి మంజూరు లభించదు. అలాగే కొత్తగా మంజూరు అవకాశం ఉండదు. దీంతో పేదలు రెండు విధాలా నష్టపోవాల్సి వస్తుంది. మార్చి నెలాఖరులోపు నిర్మాణం పూర్తి చేసుకుంటే నిధులు అందే అవకాశం ఉంటుంది. అలా నిర్మించుకోలేని పేదల పరిస్థితి దయనీయమే. ఇప్పటికే వివిధ కారణాలతో ఇళ్లు నిర్మించుకోలేని వారిలో ప్రస్తుత పరిస్థితిపై ఆందోళన వ్యక్తం అవుతోంది.

పట్టణాలకే కొత్త ఇళ్లు

జిల్లాలోని పేదలకు కేంద్ర ప్రభుత్వం కేవలం 1,005 పక్కా గృహాలను మాత్రమే మంజూరు చేసింది. లబ్ధిదారుల ఎంపిక మొత్తంగా రహస్యంగానే సాగింది. దీని మంజూరు కోసం నివేదికలను పంపుతున్నారు. ఇందులో లబ్ధిదారులెవరో, ఎవరు అర్హులు, ఎవరు అనర్హులో తెలియని పరిస్థితి నెలకొంది. బి.కొత్తకోట నగర పంచాయతీకి మొక్కుబడిగా 75, మదనపల్లె మున్సిపాలిటీకి 460, రాయచోటి మున్సిపాలిటీకి 310, రాజంపేట మున్సిపాలిటీకి 160 గృహాలు కలుపుకుని మొత్తం 1,005 ఇళ్లు కేటాయించారు. మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు కేటాయించాలంటే ఏమూలకు సరిపోవు. ఒక్కో మున్సిపాలిటీలో వేలసంఖ్యలో పేదలు ఉన్నారు. అందరికీ ఇళ్లు ఇచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో తమకు కావాల్సిన వారి కోసమే ఇళ్లు కేటాయించుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇక జిల్లాలోని 30 మండలాల పేదలకు ఇళ్ల మంజూరు ఎప్పుడు చేపడతారని ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి శివయ్య మాట్లాడుతూ తొలి విడతలో పట్టణాల్లోని పేదలకు మంజూరు చేశారని చెప్పారు. రెండో విడతలో ఇంకా ఇళ్ల సంఖ్య పెంచడంతోపాటు జిల్లా మొత్తానికి ఇళ్లు మంజూరు చేస్తారని చెప్పారు.

బాధితులకు న్యాయం చేయాలి

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ అర్జీలను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్ ద్వారా మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు. మదనపల్లెటౌన్ బసినకొండ జన్మభూమి కాలనీ కేదారేశ్వరీ దేవాలయంలో నివాసం ఉంటున్న మాండలిక వెంకటశాస్త్రి తన సమస్యను చెప్పుకోవడానికి నడవలేని స్థితిలో ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ తన ఛాంబర్ నుంచి శాస్త్రి వద్దకు వెళ్లి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చట్టపరిధిలో వారికి న్యాయం చేయాలని మదనపల్లె డీఎస్పీని ఆదేశించారు.



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడో?

- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కొరవడిన స్పష్టత
- మాటలకే పరిమితమైన హామీ
- పట్టించుకోని ప్రభుత్వం
- మోసపోయామని మహిళల ఆవేదన



రాయచోటి: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. ఎన్నికలకు ముందు మహిళలు ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించవచ్చంటూ విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. టీడీపీ కూటమి నేతలు గద్దెనెక్కి ఎనిమిది నెలలు దాటినా హామీలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఉచిత బస్సు ప్రయాణం ఇక ఎప్పుడా అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేశాయి. తమిళనాడు రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటినుంచో అమలులో ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో కూడా టీడీపీ అదే ఫార్ములాను అమలు చేసింది. ఉచిత బస్సు అంటూ జోరుగా ప్రచారం చేపట్టింది. అయితే ఈ ఉచిత బస్సు హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. చంద్రబాబునాయుడు ఉచిత బస్సు ప్రయాణమని ప్రజలను మభ్యపెట్టారని స్పష్టం కావడంతో మహిళలు ఉసూరుమంటున్నారు.

ఉచిత ప్రయాణంపై కానిరాని స్పష్టత

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటివరకు కనీసం స్పష్టత ఇవ్వలేదు. అయితే రోడ్డు రవాణాశాఖ మంత్రి త్వరలోనే అని చెప్పడం తప్ప ఎప్పటినుంచి ప్రారంభిస్తారో స్పష్టంగా చెప్పకపోవడం శోచనీయం. తొలుత గతేడాది ఆగస్టు 15 నుంచి అనడం, మళ్లీ మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణం అని వదంతులు సోషల్ మీడియాలో హల్‌చల్‌చేసిన విషయం అందరికీ తెలిసిందే. దీనికితోడు ఏకంగా చంద్రబాబు సైతం సూపర్ సిక్స్ హామీలైతే ఇచ్చాంగానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తోందని వ్యాఖ్యానించడం మహిళల అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

పండుగల పేరుతో కాలయాపన

హామీ అమలుకు పండుగల పేరుతో కూటమి నాయకులు కాలయాపన చేస్తున్నారని పలువురు మహిళలు విమర్శిస్తున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ కప్పదాటు ప్రయత్నాలు చేస్తున్నారని దుమ్మెత్తి పోస్తున్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మహిళలు, వివిధ పార్టీల నేతలు కోరుతున్నారు.

జిల్లాలో నియోజక వర్గాల వారీగా మహిళా ఓటర్ల వివరాలు	
నియోజకవర్గం	మహిళలు
రాయచోటి	129051
రాజంపేట	123617
మదనపల్లె	136078
పీలేరు	119624
కోడూరు	103794
తంబళ్లపల్లి	114163
మొత్తం	726327

మహిళా ఓటర్లను ఆకర్షించేందుకే..

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు 7,26,327 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అయితే రోజూ సగటున 50 శాతం మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని కూటమి నేతలు హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇతర హామీలతోపాటు ఈ హామీని తుంగలో తొక్కారు.

హామీ ఇచ్చేటప్పుడు భయం అనిపించలేదా?



ఎన్నికల ముందు హామీలు ఇచ్చే సమయంలో ఆచరణకు సాధ్యమా? అసాధ్యమా? అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పీఠంలో కూర్చొని ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తోందని చెప్పడం సిగ్గుచేటు. హామీలు ఇచ్చేటప్పుడు బాబుకు భయం అనిపించలేదా? కూటమికి ఓట్లు వేసి మహిళలు మోసపోయారు.

- షమీమ్ అస్లాం, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు

హామీలను నిలబెట్టుకోవాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదు. ఎప్పుడు అమలు చేస్తారో కూడా తెలియడం లేదు. పొరుగు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా ప్రభుత్వాలు అమలు చేశాయి. ఇక్కడ ఎందుకు అమలు చేయలేకపోతున్నారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసి ఇప్పటికైనా మాట నిలబెట్టుకోవాలి.

- అజంతమ్మ, వైఎస్సార్‌సీపీ మహిళా ఉపాధ్యక్షురాలు, అన్నమయ్య జిల్లా

నమ్మక ద్రోహమే



కూటమి నేతల మాటలు నమ్మి మహిళలు ఓట్లు వేశారు. ఇప్పుడు హామీ అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు. అమలు చేస్తారన్న నమ్మకం కూడా కనిపించడం లేదు. ఉచిత బస్సు ప్రయాణంపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. నమ్మి ఓట్లు వేసిన వారిని మోసం చేయడం నమ్మక ద్రోహమే. మహిళలకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలి.

- కె.మహిత, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి

క్లుప్తంగా

అగ్నికి ఆహుతైన మామిడితోట

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామం మూలపల్లె గ్రామంలో మామిడి తోట అగ్నికి ఆహుతైనట్లు బాధిత రైతు బండకింద యశోదమ్మ తెలిపారు. సోమవారం మధ్యాహ్న సమయంలో 50కి పైగా మామిడి చెట్లు, ఐదు టెంకాయ చెట్లు అగ్నికి ఆహుతవుతుండగా అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న టీటీడీ మాజీ పాలకమండలి సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విషయాన్ని ఉన్నత స్థాయి అధికారులకు నివేదించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మనోహర్ తదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెద్దమండ్యం : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీవీ రమణ సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు..మండలంలోని సిద్దవరం గ్రామం కోటగుట్టపల్లికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు తల్లి నరసమ్మ ఫిర్యాదు చేశారు. యువతి బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నట్లు తెలిపారు. మండలంలోని నడుం బురుజు గ్రామానికి చెందిన ఓ యువకుడు తీసుకెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేశారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చిన్న కొత్తపల్లె గ్రామంలో హరి అనే వ్యక్తిపై ఆకాష్, అతని తమ్ముడు దాడి చేయడంతో హరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు పాత గొడవల కారణంగా కక్ష పెట్టుకున్న నంద్యాల ఆకాష్ తన తమ్ముడితో కలిసి సోమవారం సాయంత్రం చిన్నకొత్తపల్లెలో దారికాచి బడుసు హరిపై రోకలి కర్రతో దాడి చేశారు. దీంతో గాయపడిన వ్యక్తిని వైద్యం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

24న ధర్నాను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

రాయచోటి అర్బన్ : వ్యవసాయ కార్మికులు, కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24వ తేదీన విజయవాడ వద్దగల తాడేపల్లె గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట జరుప తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు క్రిష్ణప్ప కోరారు. ధర్నాకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆయన సంఘం నాయకులతో కలసి సీపీఐ జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు.

మినిట్స్ కాపీలో ఇచ్చిన జీఓలను అమలు చేయాలి

రాయచోటి అర్బన్ : సమ్మె సందర్భంగా యిచ్చిన మినిట్స్ కాపీలోని జీఓలను వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాయచోటి ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఎస్.భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు.సోమవారం రాయచోటి ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో పలువురు వర్కర్లు, హెల్పర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. దిగువరాజువారిపల్లె కేంద్రానికి 2 ఏళ్లుగా హెల్పర్ విధులకు హాజరు కాకపోయినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. యూనియన్ నాయకులు బంగారుపాప, అరుణ, విజయ, షబీనా, సుమలత, సురేఖ, పద్మజ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలు

నందలూరు : కడప-చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు బస్టాండ్ కూడలిలో సోమవారం సాయంత్రం బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. మాధవరం నుంచి తాళ్లపాకకు బైకుపై వెళ్తున్న కమ్మినేని ప్రసాద్, శ్రీకళ దంపతులను కడప నుంచి రాజంపేటకు వెళ్తున్న కారు ఢీ కొనడంతో బైక్‌పై వెళ్తున్న దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రసాద్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.



ప్రమాదంలో గాయపడిన శ్రీకళ

హైవేపై రోడ్డు ప్రమాదం

ఇద్దరు రైతులకు తీవ్ర గాయాలు




ప్రమాదంలో గాయపడిన రైతులు

బి.కొత్తకోట : మదనపల్లె నుంచి ఖాళీ టమాట క్రేట్లతో స్వగ్రామానికి వెళ్తున్న రైతుల వాహనం బి.కొత్తకోట మండలంలోని అమరనారాయణపురంలో సోమవారం రాత్రి ప్రమాదానికి గురైంది. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో మదనపల్లెకు తరలించారు. వివరాలు.. శ్రీసత్యసాయిజిల్లా ముదిగుబ్బ మండలం సంకేపల్లి పంచాయతీ బాపనపల్లికి చెందిన రైతులు నరేంద్ర (56), శివశంకర్ (40)లు టమాట పంటను విక్రయించేందుకు సాయంత్రం బొలేరో పికప్ వాహనంలో మదనపల్లె మార్కెట్‌కు తీసుకొచ్చారు. మార్కెట్‌లో టమాటలను ఉంచి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. రాత్రి 9 గంటల సమయంలో మదనపల్లె నుంచి కదిరి వైపు వస్తుండగా బి.కొత్తకోట మండలం అమరనారాయణపురం జాతీయరహదారి వద్దకు రాగానే ప్రమాదం జరిగింది.

రైతులు వెళ్తున్న వాహనం ఎదురుగా కారు రావడంతో ప్రమాదం తప్పించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో లారీ-బొలేరో పికప్ వాహనం బాగా దెబ్బతిన్నాయి. బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

పరీక్షల భయాన్ని పోగొట్టడం అభినందనీయం



ప్రజ్ఞా వికాస్ పరీక్ష పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఈఓ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు

రాయచోటి అర్బన్ : విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టేందుకు విద్యార్థి సంఘాల నేతలు ప్రజ్ఞా వికాస్ పరీక్షలను నిర్వహిస్తుండడం అభినందనీయమని డీఈఓ సుబ్రమణ్యం అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఈనెల 27న యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో నిర్వహింప తలపెట్టిన ప్రజ్ఞావికాస్ పరీక్ష పోస్టర్‌ను డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్‌లతో కలసి విడుదల చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాయచోటి యూటీఎఫ్ కార్యదర్శి రాజా రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు గురునాథ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు చేస్తున్న వాహనాలు స్వాధీనం



పోలీసు స్టేషన్‌లో వాహనాలు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని ఒంటిమిట్ట చెరువులో ఆదివారం అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు చేస్తున్న వాహనాలను గనుల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఒంటిమిట్ట చెరువులోని రైలుకట్ట అవతల ఉన్న చెరువు ప్రాంతంలో అక్రమంగా జేసీబీతో మట్టి గుల్లను త్రవ్వి, ట్రాక్టర్‌కు పోస్తున్న సమయంలో గనులశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మట్టి తవ్వుతున్న జేసీబీని, ట్రాక్టర్‌ను అదుపులోని తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పారు.

'నా భర్త నుంచి కాపాడండి'



జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు పార్వతమ్మ, వివిధ సంఘాల నాయకులు

రాయచోటి టౌన్ : నా భర్త నుండి నన్ను కాపాడండి అంటూ మదనపల్లె పట్టణం పెంచిపాడు రోడ్డుకు చెందిన పి. పార్వతమ్మ అనే మహిళ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు ఫిర్యాదు చేసింది. సోమవారం ఆమె తన కుటుంబ సభ్యులతో కలసి జిల్లా కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌కు వచ్చి ఈ ఫిర్యాదు చేసింది. ఆమె కథనం మేరకు మదనపల్లె రూరల్ పరిధిలోని చిన్న తిప్పసముద్రం గ్రామానికి చెందిన ఈమెకు 23 ఏళ్ల క్రితం మదనపల్లె పట్టణంలోని పి. భాస్కర్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఆమె భర్త మదనపల్లె ఎస్టేట్‌లోని గార్మెంట్‌లో మేనేజర్‌గా పని చేస్తాడు. ఈ క్రమంలో అతను మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని భార్యను వేధిస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె వెంట రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున, శ్రీరాములు, రామప్ప, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ కేసులో మదనపల్లె వాసి అరెస్టు

- హైదరాబాద్‌కు తరలించిన తెలంగాణ పోలీసులు
- ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ. 11 లక్షలు వసూలు

మదనపల్లె : సైబర్ కేసులో నిందితుడైన మదనపల్లె వాసిని సోమవారం తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక కోర్టులో హాజరు పరిచి హైదరాబాద్‌కు తరలించారు. వివరాలు... మదనపల్లె పట్టణం ఆర్‌ఆర్ వీధిలో ఉన్న షేక్ షా నవాజ్ (32) నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామంటూ ప్రైవేట్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. ఉద్యోగాలు ఇప్పిస్తామని 15 మంది నిరుద్యోగుల వద్ద రూ. 11 లక్షల నగదు వసూలు చేశాడు. ఉద్యోగాలు ఇప్పించకపోగా, కాలయాపన చేస్తూ వచ్చాడు. తాము చెల్లించిన నగదు తిరిగి ఇచ్చేయాలంటూ బాధితులు ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో బాధితులు ఫోన్ చేస్తే సమాధానం ఇవ్వకపోవడంతో, ఉద్యోగాలు ఇప్పించకుండా తమ నగదు కాజేసి మోసం చేశాడని గ్రహించిన బాధితులు హైదరాబాద్ గచ్చిబౌలి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసిన తెలంగాణ పోలీసులు విచారణలో భాగంగా నిందితుడి ఆచూకీ తెలుసుకొని, సోమవారం మదనపల్లెకు వచ్చి వన్‌టౌన్ పోలీసుల సాయంతో అరెస్టు చేశారు. స్థానిక కోర్టులో నిందితుడిని హాజరు పరిచి, విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

ఉపాధి అవినీతిపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌ను కోరిన ఎంపీపీలు, సర్పంచ్‌లు



ఉపాధి పనుల అవినీతిపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో ఉపాధి పనుల కేటాయింపులను, కూలీల వేతనాల పంపిణీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని జిల్లాలోని ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం వీరబల్లి ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డితో కలిసి జిల్లాలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కలిశారు. ఉపాధిహామి పనులను కాంట్రాక్టర్లకు ఇవ్వకూడదన్న హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని విన్నవించారు. స్థానిక టీడీపీ నాయకులు యంత్రాలతో పనులు చేయిస్తూ, ప్రైవేటు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి నిబంధనలకు విరుద్ధంగా నిధులను డ్రా చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామసభ ఆమోదించిన పనులను మాత్రమే చేయాలని తెలిపారు. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించామన్నారు. ఇలా చేయడం ఉపాధిహామి చట్టం ఉల్లంఘన కిందకు వస్తుందని, చట్ట విరుద్ధమని, అలా ప్రైవేటు కాంట్రాక్టర్లకు కేటాయించిన పనులను వెంటనే రద్దు చేయాలని తీర్పు ఇచ్చిన ఆదేశాలను కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం నాయకులు ఎం.రామస్వామి రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బుద్ధునికొండ అభివృద్ధికి సహకరించాలి



ఉపాధి పనుల అవినీతిపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ తదితరులు


మదనపల్లె : మండలంలోని అంకిశెట్టిపల్లె బుద్ధుని కొండ అభివృద్ధికి సహాయం అందించాల్సిందిగా సీఎం చంద్రబాబునాయుడుని కోరుతామని ఇంటర్నేషనల్ బిక్షు సంఘం ప్రతినిధులు భంతే సద్దారక్కిత(తెలంగాణ), డాక్టర్ నాగభూషణం భంతే(యూపీ), భంతే నాగరత్న(కర్నాటక)లు తెలిపారు. సోమవారం బుద్ధ అంబేద్కర్ సమాజ్ ఫౌండర్ ట్రస్టీ ఉపాసక పీటీఎం శివప్రసాద్‌తో కలిసి బుద్ధుని కొండను సందర్శించారు. విహారలోని బోధి వృక్షానికి, భగవాన్ బుద్ధ విగ్రహానికి పూజలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...ప్రకృతి సిద్ధమైన సౌందర్యం, కనువిందుచేసే ఆధ్యాత్మిక శోభతో మానసిక వికాసం కలిగించి, పంచశీల పరివర్తన పీఠంగా చరిత్ర పుటల్లో నిలిచే గొప్ప పుణ్యక్షేత్రం బుద్ధునికొండ అని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పురాతన బౌద్ధ విహారాలు చాలావరకు శిథిలావస్థలో ఉండగా, కొత్తగా మరికొన్ని విహారాలు నిర్మాణంలో ఉన్నాయని, వీటి అభివృద్ధికి ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తే రాష్ట్రంలో టూరిజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

ధమ్మసభకు విచ్చేయండి..

బెంగళూరు సిటీ సదాశివనగర్‌లోని నాగసేన బుద్ధవిహారలో ఇంటర్నేషనల్ బిక్షుసంఘం సౌత్ ఇండియా బ్రాంచ్ ఆధ్వర్యంలో ఈనెల 23న ధమ్మసభ నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధ భిక్షువులు హాజరవుతున్న ఈ సభకు బౌద్ధ ఉపాసిక, ఉపాసకులు, బౌద్ధాభిమానులు పెద్దసంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రఘునాథ్, ట్రస్ట్ సభ్యులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, తలారి కృష్ణ, బురుజ జనార్దన్, నీరుగట్టి రాజేష్, సి.కల్యాణ్, బైనేని సురేష్, శరత్‌కుమార్, శంకరమ్మ, పృథ్వీరాజ్ అంబేద్కర్(అభి) తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మంత్రి స్థాయికి తగవు

ముస్సిపల్ ఛైర్మన్, పాలకవర్గం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పాలకవర్గంపై రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం ఆయన స్థాయికి తగదని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లో ఆయనతో పాటు పాలకవర్గ సభ్యులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయచోటి మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గం ఎలాంటి సహాయ, సహకారాలు అందించడం లేదని మంత్రి చెప్పడం దారుణమన్నారు. రాయచోటి అభివృద్ధికి మంత్రి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా తమ వంతు పూర్తి స్థాయి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. మున్సిపల్ పరిధిలో కౌన్సిల్ అనుమతి లేకుండానే తెలుగు దేశం పార్టీ నేతలు పలు పనులను చేపడుతున్నా కౌన్సిల్ సభ్యులెవరూ ఎలాంటి అభ్యంతరం తెలుపలేదన్నారు. గత మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో 15వ ఫైనాన్స్ నిధుల వినియోగానికి సంబంధించి అధికారులు ఇష్టారాజ్యంగా తయారు చేసిన ప్రతిపాదనలను కౌన్సిలర్లు వ్యతిరేకించారన్నారు. 15వ ఫైనాన్స్ నిధులు కేంద్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు కేటాయిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయిస్తున్నట్లు మంత్రి చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారుల పనితీరు కారణంగానే మున్సిపల్ పాలకవర్గం, మంత్రికి మధ్య సమన్వయం లోపించిందని తెలిపారు. మంత్రి ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు తీసుకువచ్చినా అభివృద్ధికి తమ పాలకవర్గం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు ఈశ్వర్, సాదక్‌అలీ, కొలిమి చాన్‌బాషా, రౌనఖ్ హుస్సేన్, గౌస్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫయాజ్ అహమ్మద్, అన్నా సలీం, రియాజ్, ఇర్ఫాన్, శ్యామ్‌కుమార్, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు శిక్ష



షేక్ ఇలియాస్

రాయచోటి టౌన్ : మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించిన నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ఈ.ప్రసూన తీర్పు వెలువరించినట్లు రాయచోటి అర్బన్ పోలీసులు తెలిపారు. అర్బన్ ఎస్ఐ అబ్దుల్ జాహీర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణంలోని కొత్తపల్లె వీధిలో జబ్బార్ స్కూల్ దగ్గర నివాసం ఉండే షేక్ ఇలియాస్ అదే వీధిలో నివాసం ఉండే మహిళలతో అసభ్యకరంగా మాట్లాడేవాడు. ఈ క్రమంలో అదే వీధికి చెందిన మహబూబ్ జాన్‌తో గొడవ పడి అసభ్యకరంగా మాట్లాడాడు. ఇరుగుపొరుగువారు ఇచ్చి సర్దిచెప్పి పంపించారు. అయితే దీనిని అవమానంగా భావించిన షేక్ ఇలియాస్ 2022 సంవత్సరం జూన్ 1వ తేదీ రాత్రి 9-30 గంటల సమయంలో ఇంటి బయట ఒంటరిగా పడుకొని ఉన్న మహబూబ్ జాన్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించాడు. సమీపంలోని పఠాన్ గులాబ్‌జాన్, హసీనా, మజహర్, అష్రిఫూన్‌లు గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. దీనిపై విచారణ సాగించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. జరిమానా విధించారు. ఈ కేసులో ప్రభుత్వ న్యాయవాది జగన్ మోహన్ రెడ్డి వాదనలు వినిపించగా, కోర్టు కానిస్టేబుళ్లు జి. రమేష్, నాగశంకర్‌లు సాక్షులను ప్రవేశపెట్టారు.